# తెల్లబంగారం.. కొనుగోళ్ల జోరు



- ఇప్పటివరకు 17,776 క్వింటాళ్ల పత్తి సేకరణ
- జిల్లాలో 13 పత్తి కొనుగోలు కేంద్రాలు
- సీసీఐతోపాటు ప్రైవేట్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- ఈ ఏడాది 2.80 లక్షల క్వింటాళ్ల పత్తి సేకరణే లక్ష్యం
- ప్రభుత్వ మద్దతు ధర రూ.7020
- మూడు రోజుల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ
- ఇప్పటివరకు పత్తిని విక్రయించిన రైతుల ఖాతాల్లో రూ.4.64 కోట్ల చెల్లింపులు
- ఈ ఏడాది 2.45 లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగు

వికారాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : పత్తి సాగు చేసిన ప్రతి రైతుకూ కనీస మద్దతు ధర అందేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఇందు కోసం దళారుల బారిన పడి పత్తి రైతులు మోసపోకుండా ప్రభుత్వమే సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వారి నుంచి పత్తిని సేకరిస్తున్నది. జిల్లాలో పత్తిని కొనుగోలు చేస్తున్న జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కేంద్రాలతో పాటు ప్రైవేట్ కేంద్రాలను కూడా రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. పత్తిలో తేమ శాతాన్ని బట్టి సీసీఐ రైతుల నుంచి పత్తిని సేకరిస్తున్నది. జిల్లా వ్యాప్తంగా 13 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన జిల్లా యంత్రాంగం.. ప్రస్తుతం 9 కొనుగోలు కేంద్రాల్లో పత్తి సేకరణ ప్రక్రియ షురూ అయింది. మరో నాలుగు కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం రైతులు పత్తి ఏరుతున్న నేపథ్యంలో నాలుగైదు రోజుల్లో సంబంధిత కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. గతేడాదితో పోలిస్తే కనీస మద్దతు ధర కూడా పెరిగింది. గతేడాది సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన పత్తి క్వింటాల్‌కు రూ.6300గా నిర్ణయించగా, ఈ ఏడాది రూ.7020గా నిర్ణయించారు. ప్రైవేట్ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ.6900 నుంచి రూ.7100 లకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది గతంలో ఎన్నడూలేని విధంగా జిల్లా రైతాంగం పత్తిని సాగు చేసిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలకు భారీగా వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### మూడు రోజుల్లోనే..

పత్తిని విక్రయించిన రైతులకు మూడు రోజుల్లోగా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నారు. ఇప్పటివరకు రైతులు విక్రయించిన పత్తికి రూ.4.64 కోట్లు చెల్లించినట్లు సంబంధిత అధికారి వెల్లడించారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 2.45 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశా రు. అత్యధికంగా వికారాబాద్ డివిజన్‌లో సాగు చేశారు. బొంరాస్‌పేట మండలంలో 3,750 ఎకరాలు, దౌల్తాబాద్‌లో 12,986 ఎకరాలు, కొడంగల్‌లో 28,100 ఎకరాలు, చౌడాపూర్‌లో 670 ఎకరాలు, దోమలో 2,661 ఎకరాలు, కులుకచర్లలో 565ఎకరాలు, పరిగిలో 18,520 ఎకరాలు, పూడూరులో 24,902 ఎకరాలు, బషీరాబాద్‌లో 9160 ఎకరాలు, పెద్దేముల్‌లో 14,068 ఎకరాలు, తాండూరులో 4961 ఎకరాలు, యాలాలలో 10,007 ఎకరాలు, బంట్వారంలో 9,910 ఎకరాలు, ధారూరులో 14,090 ఎకరాలు, కోట్‌పల్లిలో 14,565 ఎకరాలు, మర్పల్లిలో 19,891 ఎకరాలు, మోమిన్‌పేటలో 20,631 ఎకరాలు, నవాబుపేటలో 18,500 ఎకరాలు, వికారాబాద్ మండలంలో 17,284 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు.

### ముందుగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ప్రస్తుతం జిల్లా అంతటా పత్తి కొనుగోళ్లు జోరందుకున్నాయి. ప్రతి ఏటా నవంబర్ చివరి వారంలోగా రైతులు పత్తిని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది కూడా ముందుగానే పత్తి కొనుగోలు కేంద్రాలను జిల్లా మార్కెటింగ్ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. పత్తిని రైతుల నుంచి సేకరించేందుకు జిల్లావ్యాప్తంగా 13 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాండూరులో మారుతి, శుభం, బాలాజీ కొనుగోలు కేంద్రాలు, కోట్‌పల్లిలో సాయిబాబా కాటన్ అగ్రో ఇండస్ట్రీస్, పరిగిలో లక్ష్మీ వెంకటేశ్వర, నరసింహ, రాకంచర్ల కాటన్ మిల్, వికారాబాద్‌లో ధరణి, సాయిబాబా, అయ్యప్ప జిన్నింగ్ మిల్లులో, మర్పల్లిలో శ్రీఅయ్యప్ప కాటన్ ట్రేడర్స్, కొడంగల్‌లో విజయ్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కేంద్రాలతోపాటు ప్రైవేట్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### 2.80 లక్షల క్వింటాళ్ల పత్తి సేకరణే లక్ష్యం

ఈ ఏడాది జిల్లా అంతటా పెద్ద మొత్తంలో జిల్లా రైతాంగం పత్తి పంటను సాగు చేసిన నేపథ్యంలో భారీగా పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది 2.80 లక్షల క్వింటాళ్ల పత్తిని సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు. ఇప్పటివరకు 17,776 క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి సేకరించారు. అత్యధికంగా తాండూరులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 11,801 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. కొడంగల్‌లో 4,086 క్వింటాళ్లు, వికారాబాద్‌లో 375 క్వింటాళ్లు, కోట్‌పల్లిలో 1,458 క్వింటాళ్లు, ధారూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా 53.7 క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి సేకరించారు.

# ధారూరుకు జన జాతర

- మెథడిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు
- తరలివస్తున్న యాత్రికులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



సభ ప్రాంగణంలో సేద తీరుతున్న భక్తులు

ధారూరు, డిసెంబర్ 8 : ధారూరు మెథడిస్టు జాతరకు నాలుగో రోజు భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. జాతర ప్రాంగణంలోకి భారీ వాహనాల ను నిషేధించారు. యాత్రికులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర ప్రాంగణంలో ఏసుక్రీస్తు పాటలు హోరెతిస్తున్నాయి. భక్తులకు బైబిళ్లను ఉచితంగా దాత లు అందజేస్తున్నారు. జాతర ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి తరలివస్తున్నా రు. యాత్రికులు కాలినడకన కూడా చాలా మంది ఇక్కడికి చేరుకుంటున్నారు. గత రెండేండ్లుగా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయడంతో పాటు యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. వందేండ్లు పూర్తి చేసుకుంటున్న మెథడిస్టు జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు.



జాతర ప్రాంగణంలోకి తరలి వస్తున్న యాత్రికులు

# 11న కలెక్టరేట్‌లో ప్రజావాణి

### కలెక్టర్ నారాయణరెడ్డి



వికారాబాద్, డిసెంబర్ 8 : తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలను పురస్కరించుకుని తాత్కాలికంగా రద్దు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ఈ నెల 11న నిర్వహిస్తున్నామని వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.



కులకచర్లలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

# వేగవంతంగా ధాన్యం సేకరణ

- కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి
- వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కులకచర్ల, డిసెంబర్ 8 : రైతుల నుంచి ధాన్యాన్ని త్వరితగతిన సేకరించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం కులకచర్ల మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాభావ పరిస్థితులు ఉన్న కారణంగా ధాన్యం తడువకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరిపోను గన్నీ బ్యాగులు ఉండేలా చూడాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా కేంద్రం నిర్వాహకులు చూసుకోవాలన్నారు. నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలును త్వరితగతిన సేకరించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే రైస్‌మిల్లులకు పంపించాలని తెలిపారు. రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే రైతుల వివరాలను ఓపీఎంఎస్ చేయడంతో పాటు ట్రక్ షీట్ జనరేట్ చేసి రైతులకు వెంట బిల్లులు చెల్లించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణపై నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల తహసీల్దార్ మురళీధర్, ఏపీఎం శోభ, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

# మైనారిటీ విద్యార్థులకు పూర్తి నిధులతో స్కాలర్‌షిప్

వికారాబాద్, డిసెంబర్ 8 : సౌది అరేబియాలోని కింగ్ అబ్దుల్ అజీజ్ విశ్వ విద్యాలయం 2024 విద్య సంవత్సరానికి మైనారిటీ విద్యార్థులకు పూర్తి నిధులతో స్కాలర్‌షిప్ ఇవ్వనున్నదని మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. వివిధ విభాగాల్లో మాస్టర్, పీహెచ్‌డీ, డిగ్రీ ప్రోగ్రాం కోర్సులు కొనసాగించడానికి ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఇతర పూర్తి వివరాలకు (:https://graduatestudies.kau.edu.sa/Content-306-EN-278671)లో పొందుపర్చామని సూచించారు. ఈ నెల 28 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# జేఎన్‌టీయూలో కొత్త కోర్సులపై కసరత్తు

సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్ని రకాల ఇంజినీరింగ్, ఎంబీఏ కళాశాలల్లో మార్కెట్, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఎమర్జింగ్ టెక్నాలజీలో కొత్త కోర్సులను ప్రవేశ పెట్టనున్నారు. యువత ఉద్యోగ ఉపాధి లక్ష్యంగా ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ)లో పలు రకాల కాంబినేషన్లను పరిచయం చేయనున్నారు. ఈ క్రమంలో దేశ వ్యాప్తంగా ఉన్న పలు ఐఐటీలకు చెందిన పలువురు సీనియర్ ప్రొఫెసర్లు, హెచ్‌వోడీ, ఎన్ఐటీలకు చెందిన సీనియర్ ప్రొఫెసర్లతో పాటు రాష్ట్రంలోని పలు రకాల యూనివర్సిటీలకు చెందిన సబ్జెక్టు నిపుణులతో కొత్త కోర్సులపై చర్చించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఆ యూనివర్సిటీ అధికారులు అభిప్రాయపడ్డారు. జేఎన్‌టీయూలో చదివిన విద్యార్థి ఇతర దేశాలకు చెందిన పలు యూనివర్సిటీల్లో ఉన్నత విద్య కోసం ప్రవేశాలు పొందడానికి అనుకూలంగా ఉండేలా ఆయా దేశాల యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లతో జేఎన్‌టీయూ ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ మార్కెట్ అంచనాలు, పెరుగుతున్న అవసరాలు, డిమాండ్‌కు అనుగుణంగా టెక్నాలజీలో నూతన కాంబినేషన్లతో కొత్త కోర్సులను రూపొందించనున్నారు. ఈ విషయంలో ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ గోవర్ధన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాదిలో వీలైనంత త్వరలోనే సబ్జెక్టు నిపుణుల కమిటీ సమావేశం కానున్నట్లు తెలిసింది. యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏఐఎంఎల్, డాటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఐవోటీ, కంప్యూటర్ ఇంజినీరింగ్ తదితర పలు రకాల కాంబినేషన్లతో సీఎస్‌ఈ కోర్సు నడుస్తున్నది. సంప్రదాయక కోర్సుల్లో సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ తదితర కాంబినేషన్లతో ఇంజినీరింగ్ బోధన సాగుతున్నది. అయితే ఈ కోర్సులకు డిమాండ్ లేక పోవడంతో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ వైపే మొగ్గు చూపుతున్నారు.